అంటున్నాడు. అప్పుడు బాబా ఏమిచెప్పారు అంటే నేను 5రూ॥ల కోసం ఇంతమంది ఇంటికి పంపుతున్నాను. నీజేబులో ఉన్న 5రూ॥లు తీసిఇవ్వటం లేదు, ఇంక నీకు బ్రహ్మజ్ఞానం ఏమిటిరా బయటకు పొమ్మన్నారు. 5రూ॥లు విడిచిపెట్టలేని నీకు బ్రహ్మజ్ఞానమా? నీకు త్యాగబుద్ధి లేనప్పుడు బ్రహ్మజ్ఞానమా? అన్నారు బాబా. గౌతమబుద్ధుడు బ్రహ్మజ్ఞానం కోసం రాజ్యాన్ని విడిచిపెట్టాడు. వీడు జ్ఞానం కోసం 5 రూ॥లు విడిచిపెట్టలేకపోతున్నాడు. సంతానం వలనగాని యశస్సు వలన గాని, ధనం వలన గాని దేనివలన నీకు మోక్షంరాదు, ఆత్మజ్ఞానం రాదు దేహాభిమానాన్ని ఎవడైతే త్యాగం చేసాడోవాడికి మాత్రమే జ్ఞానం కలుగుతుంది. త్యాగికానివాడు జ్ఞాని కాలేడు అని వేదంలో చెప్పారు. మీకు అన్నీ పోయినా ఇంకా సంతోషంగానే ఉన్నారు ఏమిటి అని ఈ మధ్య ఒకరిని అడిగాను. అన్నీ పోయినా భవిష్యత్ ఉంది కదా అన్నారు ఆయన. కష్టపడితే మరల సంపాదించుకోవచ్చు కదా, ఏడుస్తూ ఇంటి దగ్గర కూర్చోవటం ఎందుకు అన్నారు. అది పాజిటివ్‌తింకింగ్, ఆ పాజిటివ్‌తింకింగ్‌ను మనం అలవర్చుకోవాలి, నువ్వు ఒక పనిచేస్తే, ఒకమాట మాట్లాడితే దానివలన నీ దేహానికి సంబంధించిన ధ్యాస తగ్గాలి. దేహానికి సంబంధించిన ధ్యాస తగ్గితే ఈశ్వరుడిపట్ల ధ్యాస పెరుగుతుంది. నిన్ను ఎవరైనా స్తోత్రం చేసినప్పుడు, నిందించినప్పుడు నీ మనస్సు సమానంగా ఉందో లేదో చూసుకో, అది సమానంగా లేదు అనుకో మనస్సు హృదయంలోనికి వెళ్ళదు. మనం సాధనలో ముందు ఏమి చేయాలి అంటే మన మనస్సును హృదయాభిముఖంగా ప్రయాణం చేయటానికి తయారుచేయాలి. ఎవడైతే పరమాత్మను మర్చిపోకుండా ఉంటాడో వాడికి పరమాత్మ అన్నీ చక్కబెడతాడు. ఎవడైతే ఈశ్వరుని కరుణకు పాత్రుడవుతాడో వాడికి మాత్రమే సచ్చిదానందము అనుభవంలోనికి వస్తుంది. బాబా రెండు సంవత్సరాలకు శరీరం విడిచిపెడతారు అనగా ఆయన బట్టలు అన్నీ తీసేసి ధునిలో పడేసారు. ఎవరోవెళ్ళి ఒకతుండు కట్టారు. అప్పుడు బాబా ఏమన్నారు అంటే ఈబట్టలు ధునిలో పడేసాను. ఈబట్టలుపోతే నేనుపోయానా? లేదు, అలాగే ఈశరీరం పోయినప్పుడు కూడా నేను పోను, నేను ఉంటాను అన్నారు అంటే భక్తులను సమాయత్తం చేయటం కోసం చేసారు. శరీరం ఉన్నప్పుడు కూడా నిన్ను అనుగ్రహించేది శరీరం కాదు. ఏదైతే నిన్ను అనుగ్రహిస్తుందో, నీపట్ల దయచూపిస్తోందో దానికి చావులేదు అన్నారు. ఈశరీరంపోతే ఉండము అని ఇప్పుడు మనం అనుకొంటున్నాము. లోపలఉన్నసత్యవస్తువు మనకు అనుభవం లోనికి వస్తే ఈశరీరం పోయినా మనం ఉంటాము అని మనకు తెలుస్తుంది. శరీరం చనిపోయేటప్పుడు నేను చనిపోతున్నాను అని ఎవడైతే అనుకుంటున్నాడో వాడికే జన్మల గొడవ, లోకంలోని విషయాల గొడవ ఈ పెంట అంతా వాడికే కావాలి. జీవించటానికి, మరణించటానికి ఎవడికైతే బేధం తెలియదో వాడే బ్రహ్మజ్ఞాని. ఎవరైనా వచ్చి ఉద్రేకంతో రజోగుణంతో మాట్లాడుతున్నారు అనుకోండి, మనం రజోగుణంతో మాట్లాడకూడదు, సత్వగుణంతో మాట్లాడాలి. లోపల ఈశ్వరుడు ఉన్నాడు. నీ మనస్సు పవిత్రం కానప్పుడు,





ఈశ్వరానుభవం పొందటానికి తగిన మెంటల్‌మేకప్ నీకు లేనప్పుడు, నాకు ఈశ్వరుడు తెలిస్తే బాగుండును అని నీవు అనుకొన్నా నీకు ఆయన తెలియబడడు, నీ పాడుబుద్ధిని చూసి నీకు తెలియబడటానికి ఆయన నిరాకరిస్తాడు. ఏ తలంపు అయితే దేహంతో తాదాప్యం పొందుతోందో ఆ తలంపులు వెళ్ళి హృదయంలో అణిగిపోయే వరకు, అంటే మన నిజమైన ఇంటికి మనం వెళ్ళేవరకు జన్మలు వస్తూనే ఉంటాయి, కష్టాలు, సుఖాలు, దుఃఖాలు, భారాలు ఇవి అన్నీ నిన్ను వెంటాడుతాయి, ఈ జన్మలో ఒక సమస్య రాబోయే జన్మలో ఇంకో సమస్య ఇలా సమస్యలు వెంటాడుతూనే ఉంటాయి. నీకు దేహం ఉండవచ్చు, పోవచ్చు, లోకం కనిపించవచ్చు, కనిపించకపోవచ్చు కాని నాశనం లేనివస్తువు ఒకటి నీ హృదయంలో ఉంది. దాని స్వరూపం సుఖం, దాని స్వరూపం శాంతి, దాని స్వరూపం ఉండటం. అది అనుభవం లోనికి వచ్చినప్పుడు ముగింపు లేని ఆనందంలో ఊగిసలాడతావు. పరిస్థితులు బాగున్నాయని గర్వం తెచ్చుకోవద్దు, పరిస్థితులు బాగోలేదని కృంగిపోవద్దు, మీ ప్రయత్నం మీరు చేయండి, భగవంతుడు అనుగ్రహిస్తాడు. మీరు చేస్తున్న ప్రయత్నమే దేవుని దయగా మారిపోతుంది. మీరు ఏ గురువు దగ్గరకు వెళ్ళినా బాగుపడటానికి వెళ్ళాలి అంతేగాని అక్కడకు వెళ్ళి మట్టి అంటించుకొని రాకూడదు. అక్కడనేర్చుకొనేది ఉంటే నేర్చుకోండి అంతేగాని మట్టి అంటించుకోవద్దు అని బాబాగారు చెప్పారు.

## సద్గురు శ్రీనాన్నగారి అనుగ్రహభాషణములు, 1-08-04, అయిభిమవరం

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

ఏదైనా ఒక వస్తువుయొక్క విలువ తెలిసినప్పడే దానిని సంపాదించుకోవటానికి ప్రయత్నంచేస్తాము. వస్తువు విలువ తెలియనప్పుడు దానికోసం ప్రయత్నం చేయము. భక్తిని సంపాదించుకోవాలి. భక్తివలన భుక్తి వస్తుంది, ముక్తి వస్తుంది, భగవంతుడితో అనుసంధానం ఏర్పడుతుంది. భగవదనుభవం పొందటానికి మనకు ఎవరో ఇతరులు అడ్డురావటంలేదు, మన మనస్సే అడ్డు వస్తోంది. మన మనస్సును పరిశీలన చేసుకోవటం మానివేసి ఎవరో ఇతరులు అడ్డు వస్తున్నారు అనుకొంటాము. అందుచేత మనం మాట్లాడేటప్పుడుగాని, పనిచేసేటప్పుడుగాని మనస్సు యొక్క విజృంభణలేకుండా చూసుకోవాలి. మాటలో, చేతలో, నడకలో రజోగుణం ఉండకూడదు. మనస్సును నిగ్రహించుకోవటం కష్టం అని చెపుతున్నారు ఏమిటి అని అర్జునుడు కృష్ణుడిని అడిగాడు. కృష్ణుడు ఏమి చెప్పాడు అంటే అది కష్టమే కాని అభ్యాసం, వైరాగ్యం ఉంటే మనస్సును నిగ్రహించటం సాధ్యమే అని చెప్పాడు. మన దగ్గరలోపం ఏమిటి అంటే ఏదో పది నిమిషాలు అభ్యాసం చేస్తాము, మిగితా టైము మనస్సును బయటకు వదిలేస్తాము, అది రోడ్డు మీద దుమ్ము అంతా పోగు చేసుకొని వస్తుంది. ఎప్పుడూ మనం పైకి అందరిలాగే కనబడాలి, ఏమీ ప్రత్యేకత ఉన్నట్లు కనబడకూడదు లోపల మనస్సులో వైరాగ్యం పెంచుకోవాలి. అది పెద్ద మనుషుల లక్షణం. ఆడంబరం అనేది రాక్షసగుణం. రాక్షసులు ఇప్పుడులేరు అనుకోవద్దు.

ఒక మనిషి ఆడంబరంగా మాట్లాడుతూ ఉంటే వాడిలో ఎంతో కొంత రాక్షసగుణం ఉంటుంది. రాక్షసదానాలు కూడా ఉంటాయి. రాక్షసదానాలు అంటే రజోగుణంతో చేసే దానాలు. ఈ మధ్యన ఒక ఆయనస్కూలుకు ట్యూబ్‌లైట్ దానం చేసాడు. ట్యూబ్‌లైట్ ఇస్తాను అన్నవాడు పరమలోభి. ఏదోకమిటీవారు రోజూ అడుగుతున్నారు అని ఇస్తాను అన్నాడు. ట్యూబ్‌లైట్ ఎందుకు పెట్టుకొంటాము? వెలుతురుకోసం పెట్టుకొంటాము. కాని వీడు ఏమి చేసాడు అంటే లైటు నిండా పేర్లు రాయించేసుకొని అసలు వెలుతురు కనబడకుండా చేసి ఇచ్చాడు. ఇది రజోగుణదానం, ఇది రాక్షసదానం, అంటే దీనివలన మనస్సు అణగదు, మనస్సు పెరుగుతుంది. మనం పైకి అందరిలాగే ఉంటూ లోపల వైరాగ్యం పెంచుకోవాలి, అభ్యాసం పెంచుకోవాలి. మనలో ఏదో ప్రత్యేకత ఉంది అనుకొంటే అక్కడ నుండి పతనం ప్రారంభమవుతుంది. ప్రపంచంలో మనకు ఎవరిమీద యిష్టం ఉన్నా, ఇతరులకు మన మీద ఇష్టం ఉన్నా ఏదోరోజున విడిపోయి వెళ్ళిపోవాలి. అది మనస్సులో పెట్టుకొని పనిచేసుకోవాలి. మనకాళ్ళు పనిచేస్తున్నా, చేతులు పనిచేస్తున్నా మనస్సును ఎప్పుడూ దాని ఇంటిదగ్గర ఉంచాలి, దాని ఇల్లు హృదయం. మనస్సుకు దాని ఇంటి దగ్గర అది ఎక్కువసేపు ఉండేలా అలవాటు చేయాలి. మాకు భయం వేస్తోంది అని చాలామంది అంటూ ఉంటారు. అసలు ఊహించుకోవటంవలన భయం వస్తుంది. జరిగేది ఏదో జరుగుతుంది, ఏదో జరుగుతుందని ఊహించుకొని భయపడటం అనవసరం. మనస్సును దాని స్వస్థానములో ఉంచితే మీకు జపంతోటి పనిలేదు, ధ్యానంతోటి పనిలేదు. మనస్సును దాని ఇంటి దగ్గర ఉంచకుండా దానిని బయటకు తీసుకొని వచ్చేస్తున్నాము అందుచేత జపాలు, ధ్యానాలు ప్రారంభమవుతున్నాయి. మీ బిజినెస్ ఏమిటి అని ఒకసారి షిరిడిబాబాగారిని అడిగారు. నాకు బిజినెస్ ఉంది. భక్తుల క్షేమంకోరటం, వారికి ఆశీస్సులు అందించటమే నా బిజినెస్ అని బాబా చెప్పారు. గురువు అంటే నువ్వు ఎందుకు పనికిరావు వెళ్ళిపో అని చెప్పేవాడు గురువుకాదు. వాడికి శిక్షణ ఇచ్చి, లోపల హృదయంలో ఉన్న చైతన్యాన్ని అందుకొనే శక్తిని కలుగజేసి, వాడికి అర్హత కలుగజేసి, వాడిని సుఖి చేయటం గురువు బాధ్యత. నువ్వు పనికిరావు అని చెప్పేవాడు గురువుకాదు, పనికి వచ్చేలాగ తయారు చేసేవాడు గురువు. భగవంతుడు చెప్పినమాటలను మనం పట్టించు కోవటంలేదు. భగవంతుడు మీద ఉండవలసినంత గౌరవం మనకు లేదు అందుచేత ఆయన చెప్పినమాటకు ప్రాముఖ్యత ఇవ్వటంలేదు. భగవంతుడికి, ఆయన చెప్పిన మాటకు బేధంలేదు అలా బేదంచూస్తే మన నోటిలో మట్టిపడుతుంది. దేహబుద్ధి ఉన్నవాడు నిరాకారాన్ని, నిర్గుణాన్ని పట్టుకోవటం కష్టం. భగవంతుడు అంతటా ఉన్నమాట నిజమే. చెరువులో నీరు ఉన్నమాట నిజమే కాని దిగటానికి ఏదో రేవు ఉండాలికదా. విగ్రహం ఎందుకు అంటే మనస్సుకు నిగ్రహంకోసం, అంతేగాని ఆవిగ్రహానికి దేవుడు పరిమితమై ఉన్నాడు అనికాదు. మనకు ఈతవస్తే బల్లకట్టు, నావ అక్కరలేదు, మనకు ఈత రానప్పుడు ఏదో ఒక దానిని ఆశ్రయించాలి. మీరు నిరాకారాన్ని





నిర్గుణాన్ని ఆరాధించినంత మాత్రంచేత సగుణాన్ని ఆరాధించే వారిని తక్కువవారు అనుకోవద్దు. ఈ రోజు ఏదో M.Sc. చదివినా ఎప్పుడో ఒకప్పుడు పదవ తరగతి చదివాము, అది మర్చిపోకూడదు. అందుచేత ఇతరులు ఎవరైనా ఒక నమ్మకం పెట్టుకొని ఒక రూపాన్ని ఆరాధించుకొంటూ ఆరకంగా అభివృద్ధిలోనికి వస్తూ ఉంటే వారిని చెడగొట్టకూడదు. మనం పని దొంగలం కాకూడదు. మనచేతిలో ఉన్న పనిని హృదయపూర్వకంగా చేసి వదిలేయాలి. వచ్చేది ఏదో వస్తుంది, రానిది ఏదోరాదు. ఫలితం పట్ల ఆసక్తి పెట్టుకోవద్దు. ఆసక్తి పెట్టుకోవటంవలన శారీరకఆరోగ్యం, మానసిక ఆరోగ్యం చెడిపోతుంది, సాధన చేసుకోవటానికి కూడాశక్తి ఉండదు. మనం ఎవరినీ ఆక్షేపించకూడదు, ఎవరిని ఏ విషయంలో ఆక్షేపించామో అవే మనకు ఎదురవుతాయి. అందుచేత మాట విషయంలో నీకువచ్చే తలంపుల విషయంలో బహుజాగ్రత్తగా ఉండాలి. ఇతరుల విషయాలలో కలుగుజేసుకోవద్దు, నీవు తరించే ఉపాయం చూసుకో.

ఈమధ్య మాకు కష్టాలు వస్తున్నాయి, నష్టాలు వస్తున్నాయి లేకపోతే ఈమధ్య మాపరిస్థితి బాగుంది అని ఇలా ఏదో చెపుతూ ఉంటారు. ఇదంతా మాయ. మన హృదయంలో ఉన్న వస్తువు మనకు గోచరిస్తోంది అనుకోండి, హృదయంలో ఉన్న ఆనందం కొంచం మనకు అనుభవంలోనికి వస్తోంది అనుకోండి అప్పుడు మనకు జయం వచ్చినా ఏమీ గర్వంరాదు, అపజయం వచ్చినా ఎర్రచీమ కుట్టినట్లు కూడా ఉండదు. దేహప్రారబ్ధాన్ని బట్టి ఆదేహయాత్ర జరిగిపోతూ ఉంటుంది. లోపలఉన్న వస్తువు తాలుక ఎరుక నీకు వచ్చినప్పుడు దేహప్రారబ్ధాన్ని బట్టి నీకు నష్టం వచ్చినా, లాభం వచ్చినా నీకు ఏమీ అనిపించదు. ఒకపూట కూడా తిండిలేక ఇబ్బంది పడే రోజులు వచ్చాయి అనుకోండి అయినా బ్రహ్మానందం పొందేవాడికి ఏనుగు మీద కూర్చొన్నట్లుగా ఉంటుంది, వాడికి ఏ వికారం ఉండదు, ఆస్థితి అట్టిది. దానిని మాటలతో వర్ణించలేము. మన మాట, మనస్సు, ఊహలు అక్కడికి వెళ్ళలేవు, అది అనుభవైకవేద్యం, అది మనకు అనుభవంలోనికి వచ్చినప్పుడు దేహం ఉన్నా, లేకపోయినా మీకు ఏమీ అనిపించదు. ఆస్థితిని శరీరం ఉండగానే ఇక్కడే పొందవచ్చు. గురువు అంటే లోపలఉన్న చీకటిని పోగొట్టి జ్ఞానజ్యోతిని వెలిగించేవాడు. దేహం పోయినప్పుడు ఒక్క గురువుతో ఉన్న అనుబంధం తప్పించి అన్ని బంధాలు తెగిపోతాయి. మన కుటుంబసభ్యులు కూడా వారికంటే ముందు మనమయినా పోతాము లేకపోతే మనకంటే ముందు వారయినా పోతారు ఇది మనస్సులో పెట్టుకొని మనం పనులు చేసుకోవాలి. గురువును మనం చూడటంకాదు, గురువుచేత మనం చూడబడాలి. మన ఆలోచన రాగద్వేషములతో కూడిఉంటుంది. రాగద్వేషములు ఎక్కువగా ఉన్నప్పుడు మనస్సుకు లోచూపురాదు. మన అలవాట్లు సరిగా ఉంటే పెద్ద ఖర్చు ఏమీ ఉండదు. మనకు మినమమ్ కావలసింది తిండి, బట్ట, నీడ ఈ మూడింటికి పెద్ద డబ్బు ఖర్చయిపోదు. అనవసరమైన విషయాలకు వెళ్ళటంవలననే ఎక్కువ డబ్బు ఖర్చు అవుతుంది. అలవాట్లు యొక్క వేగంవలన నీ ఇల్లు

గుల్ల అవుతుంది, నీవళ్ళు గుల్ల అవుతుంది. అలవాట్లు పెంచుకొని దారిద్ర్యంతో బాధపడుతున్నాము అంటే ఎలాగ? ఎవరైనా ఏదైనామాట చెప్పినా మనం సొంతంగా ఆలోచించుకోవాలి. ఎప్పడూ సొంతబుద్ధిని విడిచిపెట్టవద్దు. సొంతబుద్ధి మనలను సుఖపెడుతుంది. ఒక ధనవంతుడు, ధనంలేనివాడికి సహాయం చేస్తున్నాడు అనుకోండి ఇంక గవర్నమెంటుతో పనిఏముంది. కొంతమందికి దేహంతో తాదాప్యం ఉంటుంది. కొంతమందికి మనస్సుతో తాదాప్యం ఉంటుంది. దేహంతో తాదాప్యం ఎంత ప్రమాదమో మనస్సుతో తాదాప్యం కూడా అంతే ప్రమాదం ఎందుచేతనంటే అవి రెండూ మనం కాదు. దేహము నేను అనే బుద్ధి ఉన్నవాడికి కోటిజన్మలు ఎత్తినా కష్టాలు, నష్టాలు, బాధలు వాడిని విడిచిపెట్టవు. ఏదైతే సత్యమో అది మనకు తెలియనంతకాలం సత్యంకానిది సత్యంవలె మనకు కనబడుతూ ఉంటుంది, అంతకాలం జన్మలు వస్తూనే ఉంటాయి, జననమరణ ప్రవాహంలో కొట్టుకొనిపోవలసిందే. ఎవడో గురువు అనుగ్రహం, దైవానుగ్రహం పొందినవాడు మాత్రమే ఒడ్డుకు వస్తాడు కాని లేకపోతే ఒడ్డుకు వచ్చే అవకాశంలేదు. అందుచేత ఇవాళ పచ్చగా ఉండి రేపు ఎండిపోయే విషయాలను చూసి ఎవరూ గర్వం తెచ్చుకోవద్దు. ఈ పచ్చగా ఉన్నవి ఎండిపోతాయి, చివరకు మన శరీరం చనిపోయాక జీవుడు కూడా ఈ గర్వం వచ్చేస్తుంది. నీ హృదయంలో ఒక నిజం ఉంది. నేను అలా ఉన్నాను, ఇలా ఉన్నాను అని అది చెప్పదు. వారు ఎలా  ఉన్నారో అలా ఉంటారు అంతేకాని వారు దేనితోనూ తాదాప్యం పొందరు. యిది మీరు బాగా గుర్తుపెట్టుకోండి. ఉన్న వస్తువు ఉన్నట్లుగా మనకు వ్యక్తమయ్యే వరకు దేహాన్ని ఆత్మ అనుకొంటాము. నీ హృదయంలో సహజంగా ఉన్న వస్తువును నీకు వ్యక్తపరుస్తాడు, అదే గురువు చేసేపని. గురువు అనుగ్రహం అతిబలీయమైనది.

మీరు గురువును ప్రేమిస్తున్నారు అంటే ఎవరినో ప్రేమిస్తున్నారు అని అనుకోవద్దు, మీ హృదయంలో ఉన్న వస్తువును మీరు ప్రేమించుకొంటున్నారు. ప్రతీ మనిషికి తనంటే తనకు ఎక్కువ ఇష్టం. ఎందుచేతనంటే తను ఆత్మ అయి ఉన్నాడు కాబట్టి. ఒక వేళ నీవు ఇతరులను ప్రేమిస్తున్నట్లు కనిపించినా అది నీకోసమే ప్రేమిస్తున్నావు కానివారి కోసం నీవు ప్రేమించటంలేదు. ఆ ప్రేమలు నిజంకాదు. జ్ఞాని తప్పించి ఎవడూ ప్రేమించలేడు, జ్ఞానికానివాడు దయచూపించలేడు. మనం అజ్ఞానంలో ఉండి, అవిద్యలో ఉండి, చీకటిలో ఉండి మనమేదో ఇతరులను ప్రేమిస్తునాము అనుకొంటే అలా ప్రేమించలేము, అది అసాధ్యం. ,బతికిఉన్నంతకాలం దేహానికి మట్టి పూసుకోవటం, మనస్సుకు మట్టిపూసుకోవటం ఇదే మన పని. ఈ దేహం ఎవరికయినా ఉపయోగపడిందా, ఏదైనా మంచి పనిచేసిందా అంటేలేదు. ఎవరికైనా సహాయం చేసిందా అంటేలేదు ఇది ఎవరినీ ప్రేమించలేదు సరికదా ద్వేషించింది. అటువంటి దేహం చనిపోతూఉంటే సంతోషించాలి గాని ఏడుస్తూ కూర్చోవటం ఎందుకు? కబీరు దేహం చనిపోయే రోజున భగవంతుడితో ఓప్రభువా! నీవు ఈదేహం నాకు ఇచ్చావు. నీవుఎంత స్వచ్ఛంగా ఈదేహన్ని నాకు ఇచ్చావో, అంత స్వచ్ఛంగా దానిని మరల నీకు ఇచ్చేస్తున్నాను. దానికి మసిరాయలేదు, దానిని ఏమీ దుర్వినియోగంచేయలేదు. నీవు ఇచ్చిన వాటిని మరల నీకే ఇచ్చేస్తున్నాను, అంత పవిత్రంగా ఇచ్చేస్తున్నాను, సంతోషంగా ఇచ్చేస్తున్నాను అన్నాడు కబీర్. నేను అది చేసాను, నేను ఇది చేసాను అని కర్తృత్వం పెట్టుకొంటే పునర్జన్మ వచ్చి తీరుతుంది. కర్తృత్వం ఉన్నవాడిని దుఃఖం విడిచిపెట్టదు, జన్మలు విడిచి పెట్టవు. అహంవృత్తి బుడగ అయితే అహంస్ఫురణ సముద్రం. అహంవృత్తిని తీసుకొనివెళ్ళి అహంస్ఫురణతో కలపటమే మన జీవితంగమ్యం. దేహం నేను అనే తలంపే మొదటి తలంపు, అదే మూలతలంపు. అందులోనుండి ఇతరతలంపులు వస్తాయి. చెట్టు మొదలు తీసివేస్తే ఇంక చెట్టు ఉండదు అలాగే ఈ మూలతలంపు ఉంటే ఇతరతలంపులు వస్తాయి కాని ఆమూలతలంపు నశిస్తే ఇంక తలంపులులేవు. లోకంలో అనేక సంఘటనలు జరుగుతూ ఉంటాయి, వాటిని అన్నింటిని మన మనస్సులోనికి రానివ్వకూడదు. భగవంతుడు చెప్పినప్రకారం జీవించి ఈలోకంలో నుండి బయటకు పోవాలి, మనస్సును తీసుకొని వెళ్ళి భగవంతుడిలో ఐక్యం చేయటం యోగం. కాని మనం మనస్సును భగవంతుడికి దూరం చేస్తున్నాము. మనస్సు భగవంతుడిలో ఐక్యం చేయటానికి మనం ప్రయత్నం చేసినా అడ్డువచ్చేది మన దేహమే ఎందుచేతనంటే మనస్సు దేహంతో తాదాప్యం పొంది ఉంటుంది, దేహంతో తాదాప్యం తగ్గిస్తేనే గాని మనస్సును భగవంతుడిలో ఐక్యం చేయలేము. మనం నిర్మలంగా, ప్రశాంతంగా కూర్చొని మీకు తలంపులు వస్తూ ఉంటే అవి ఎందుకు వస్తున్నాయి అని పరిశీలన చేస్తే దేహంతో తాదాప్యం పొందే నేనులోనుండే ఏ తలంపు అయినా వస్తుంది అంటే అన్నింటికి దేహమే కారణం అటువంటి దేహంపోతూ ఉంటే ఏడవటం ఎందుకు? మనకు ఏదైనా తలంపు వస్తూ ఉంటే  మనకు లోపల పాపం ఉన్నట్లుగుర్తు. లోపల ఏదైనా దోషం ఉన్నప్పడే తలంపు వస్తుంది లేకపోతే తలంపు తోటి పనిఏముంది. మనం అంతా భగవంతుడిలోనే ఉన్నాము.  మనం ఎక్కడో బయటలేము. ఆయనలోనే ఉన్నాము కాబట్టి ఆయననుకాదని మనం ఏమీచేయలేము, అయితే దాని తాలుక ఎరుక మనకులేదు. నీ యజమాని హృదయంలోనే ఉన్నాడు, అంతా హృదయంలోనే ఉంది. హృదయంలో ఉన్న జ్ఞాన సముద్రంలో మునగకుండా నీకు ఎవరో ఇతరులు అడ్డురావటంలేదు. నీవు ఏదైతే నేను, నేను అంటున్నావో ఆనేనే అడ్డువస్తోంది, దానిని తీసి ఒక ప్రక్కన పెట్టు అంతకన్నా ఏమీలేదు. మీ శరీరానికి అన్నం పెట్టండి కాని ఈ దొంగనేనుకు అన్నం పెట్టకండి. మిమ్మల్ని ఎవరైనా స్తోత్రం చేస్తారు అనుకోండి. మీకు సంతోషం వచ్చేస్తుంది, మిమ్మల్ని ఎవరైనా విమర్శిస్తారు అనుకోండి మీకు దుఃఖం వచ్చేస్తుంది. అప్పడు ఈ దొంగనేనుకు ఆహారం వెళ్ళిపోతుంది. మిమ్మల్ని అదృష్టం వెంటాడినప్పడు, దురదృష్టం వెంటాడినప్పడు మీరు సమానంగా ఉండలేరు అనుకోండి ఇందంతా దొంగనేనుకు మేత. ఇలా దానికి ఆహారం అందుతూ  ఉంటే మీరు జపం చేసినా, ధ్యానం చేసినా అదిపోదు. దానికి ఆహారం అందకుండా చూడండి. దొంగ నేనును దాని ఇంటి దగ్గర దానిని ఉంచండి, సింహాన్ని

బోనులో పెట్టారు అనుకోండి, అది ఎంత క్రూరమృగం అయినా అణిగి ఉంటుంది. అలాగే నీ మనస్సును హృదయంలో ఉంచు, దాని  పుట్టుస్థానంలో దానిని ఉంచటంవలన అది నెమ్మదిగా కరిగిపోతుంది. ఏదైతే దుఃఖ కారణమో దానిని హృదయంలో ఉంచటం వలన, దాని స్వస్థానంలో దానిని ఉంచటంవలన అది నెమ్మిదిగా పల్చబడి రాలిపోతుంది, అప్పడు దుఃఖం నశిస్తుంది. పుట్టినప్పడు నీవు ఏడుస్తూ పుట్టావు. కాని నీ శరీరం చనిపోయేటప్పడు నీవు ఆనందంగా ఉంటే నీకు పునర్జన్మరాదు అని కాళిదాసు చెప్పాడు. మనస్సును హృదయంలో రెండు నిమిషాలు ఉంచటానికి ప్రయత్నం చేయమంటే ప్రయత్నం చేయడు, కాశీవెళ్ళిరమ్మంటే వెళ్ళివచ్చేస్తారు. ఎందుచేత జేబులో డబ్బులు ఉన్నాయి, రైళ్ళు ఉన్నాయి వెళుతున్నారు అక్కడ మునుగుతున్నారు, వచ్చేస్తున్నారు. గంగానదిలో ఒకసారి మునిగివస్తే మోక్షం వచ్చేస్తుంది అంటున్నావు, మరి 24 గంటలు చేపలు అందులో ఉంటున్నాయి, వాటికి మోక్షం వచ్చేస్తుందా అని అడుగుతున్నారు. ఇటువంటి పిచ్చిగోడవలువద్దు, నీహృదయంలో ఉన్న వస్తువును అనుభవంలోనికి తెచ్చుకోవటానికి ప్రయత్నం చెయ్యి. నీహృదయంలో ఉన్న ఆత్మసామ్రాజ్యానికి అధిపతివి అవ్వాలంటే దేహబుద్ధి నశించకుండా అదిసాధ్యంకాదు, అందుచేత దేహబుద్ధిని తగ్గించుకోవాలి. మనకు తెలివి ఉంటే దానిని సద్వినియోగం చేసుకోవాలి.  మన తెలివివలన మనం పాడవుతూఉంటే ఇంక ఆతెలివి ఎందుకు? మన డబ్బువలన మనం పాడవుతూ ఉంటే ఇంక ఆ డబ్బు ఎందుకు? తెలివిని ఎలా ఉపయోగించుకోవాలో తెలియనప్పడు నీకు తెలివితేటలు ఎందుకు?  ఈ మధ ఒకరితో మీరు భవిష్యత్‌లో ముగింపులేని సుఖాన్ని పొందవచ్చు అన్నాను. ఆయన ఏమి చెప్పారు అంటే ముగింపులేని సుఖం నేను పొందుతానో లేదో నాకు తెలియదు కాని ఇప్పడు నాకు ముగింపులేని అజ్ఞానం ఉంది, దానిని పోగొట్టుకోవటానికి ఎంతో కొంతప్రయత్నం చేస్తున్నాను కాని దానికి ముగింపు కనబడటంలేదు. అసలు ఈ అజ్ఞానానికి ముగింపు కనబడితే కదా ముగింపులేని సుఖాన్ని నేను పొందేది అంటున్నారు. మీరు ఏకాంతవాసంగా ఉండి మీ మనస్సులో బలహీనతలు ఏమిటో చూసుకోండి. ఏకారణంవలన మీమనస్సు బాహ్యముఖానికి వెళుతోందో చూసుకొని ఆకారణాలను తొలగించుకొంటే లోపలఉన్న వస్తువు మీకు వ్యక్తమవుతుంది. మనం ఈ గోడను శుభ్రం చేయాలి అనుకోండి, శుభ్రత ఎక్కడో బజారులోనుండి తేనక్కరలేదు, గోడకు ఉన్న దుమ్మును దులిపేయాలి అప్పడు శుభ్రత వచ్చేస్తుంది. అలాగే మీలో ఉన్న ఆటంకాలను దులిపేసుకోండి, దీర్ఘకాలంనుండి వస్తున్న వాసనలను దులిపేసుకోండి అప్పడు ఉన్న వస్తువు తనంతట తానుగా నీకు వ్యక్తమవుతుంది. సూర్యుడు ఉదయించిన వెంటనే వెలుతురు ఎలాగ వచ్చేస్తుందో అలాగ బ్రహ్మానందం పొందటానికి నీకు అర్హత వచ్చినప్పడు, ఆమెచ్యూరిటీ నీకు వచ్చినప్పడు వెంటనే బ్రహ్మం నీకు అనుభవంలోనికి వస్తుంది, ఒక్కక్షణం కూడా ఆగదు. బ్రహ్మానుభవం నీకు కలగటానికి తగిన అర్హత, యోగ్యత పట్టించేవాడు గురువు. బ్రహ్మం ఎంత పవిత్రమైనదో

**20-8-2004**

నీమనస్సును ఆస్థాయికి తీసుకొనిపోయేవాడు, మనస్సును దానికి సమాయత్తం చేసేవాడు గురువు. నీకు జ్ఞానం రాకుండా ఎవరో ఇతరులు అడ్డు రావటంలేదు. మా ఆయనకు దేవుడి మీద నమ్మకంలేదు అండి, రామా అనుకోనివ్వరండి.  మాఅత్తగారు మీటింగులకు వెళ్ళనివ్వరండి అంటారు. అసలు మీకుభక్తి ఉన్నట్లు మీ ఇంట్లోవారికి ఎందుకు తెలియాలి. అసలు భక్తిని ఎంత రహస్యంగా ఉంచుకొంటే అంత మంచిది. మీఅత్తగారు అడ్డువస్తున్నారు, మీఆయన అడ్డువస్తున్నారు అని మీకు అనిపిస్తుందికాని వారు ఎవరూ అడ్డు రావటంలేదు, మీ బలహీనతలే మీకు అడ్డు వస్తున్నాయి. అందుచేత మీలో బలహీనతలు ఏమి ఉన్నాయో చూసుకొని భగవంతుని పాదాలను ఆశ్రయించి ఆబలహీనతలు తొలగించమని ఆయనను ప్రార్థించాలి. మనకు ఏది మంచిదో మనకంటే భగవంతుడికి ఎక్కువ తెలుసు కాని ఆయనకు తెలియదేమో అనుకొని మనం కంగారు పడుతున్నాము, మానసిక అనారోగ్యానికి గురి అవుతున్నాము. మనం నేను అనేటప్పటికి మనకు దేహమే స్ఫురిస్తుంది. ఆదేహగతమైన నేనును అధిగమించు. దానిని అతిక్రమించు. ఎప్పడూ మన గురి ఆత్మజ్ఞానం మీదే ఉండాలి ఇది మీరు బాగా గుర్తు పెట్టుకోండి. ఈ కర్మచేస్తే మంచి ఫలితం వచ్చేస్తుంది, మంచిలోకం వచ్చేస్తుంది అనుకొంటాము. ఆకర్మఫలితం ఎంతకాలం ఉంటుందో నువ్వు ఆలోకంలో అంతకాలమే ఉంటావు. తరువాత ఈ భూమిమీదకు తిరిగిరావలసిందే. మనం మొదటి ఆట సినిమాకు వెళ్ళాము అనుకోండి. అక్కడ వేడివేడి వడలు, బజ్జీలు తెస్తాడు, కొనుక్కొని తింటాము, తరువాత సిగరెట్లు కాల్చుకొంటూ ఉంటాము. ఆట అయిపోయిన తరువాత మనలను అక్కడ ఉండనివ్వరు, వెళ్ళి రమ్మంటారు. మరల ఇంటికి వెళ్ళిపోయి డబ్బులు సంపాదించుకొని మరుసటి రోజున వెళితే వెళ్ళవచ్చు. అలాగే ఏదో పుణ్యం సంపాదించుకొని స్వర్గానికి వెళ్ళినా అది ఖర్చుఅయిపోయిన తరువాత పొమ్మంటారు. మరల ఈభూమి మీదకు రావలసిందే. నువ్వు ప్రశాంతంగా కూర్చొని దేహము నేను అనే తలంపు ఎక్కడ నుండి వస్తోందోచూడు, మరల దానిని అక్కడకే పంపాలి. అలా దానిని పంపటానికి నిరంతరం లోచూపు ఉండాలి. నిరంతరం లోచూపు ఉండాలంటే గురువు అనుగ్రహం ప్రవహిస్తూ ఉండాలి. జీవుడు ఎక్కడయితే ఉదయించి వస్తున్నాడో అక్కడకువాడిని పంపించి, ఎక్కువసేపు అక్కడ ఉంచగలిగాలి. జీవుడి యొక్క పుట్టిల్లు హృదయం. జీవుడిని హృదయంలో ఎక్కువసేపు ఉంచగలిగితే జీవలక్షణాలు నశిస్తాయి, అప్పడు జీవుడు ఆత్మాకారం చెందుతాడు, మనస్సును దాని పుట్టుస్థానంలో ఉంచండి. అది అక్కడ ఉండటంలేదు, బయటకు వచ్చేస్తోంది. మరల దానిని లోపలకు పంపటానికే జపాలు, ధ్యానాలు, సజ్జనసాంగత్యం, యాత్రలు, నదులలో మునగటాలు ఇవి అన్నీ చేయవలసివస్తోంది. మనస్సును బయటకు రాకుండా చూసుకొంటే జపాలు, తపాలు, ఈసాధనలతో నీకు పనిలేదు. భగవంతుడు చెప్పిన వాక్యం నందు విశ్వాసం కలిగి ఉంటే ఆయన దయ మన మీద ప్రవహిస్తుంది. మీ పని మీరు శ్రద్ధగా చేసుకోండి, ఆసక్తి పెట్టుకోవద్దు, ఆసక్తివలన మానసికఆరోగ్యం, శారీరకఆరోగ్యం చెడిపోతుంది.

**రమణ భాస్కర**

## సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు

| | | |
|---|---|---|
| 27-08-2004 | శుక్ర | విజయవాడ, గవర్నమెంట్ ప్రెస్ దగ్గర, శివాలయం |
| 28-08-2004 | శని | విజయవాడ, షిర్డిసాయి సేవా శిబిరం, స్క్రూ బ్రిడ్జ్ దగ్గర, బెంజి సర్కిల్, |
| 29-8-04 టు 5-9-04 | | అరుణాచలం |
| 06-09-2004 | సోమ | భీమవరం, శివరావు పేట, సరస్వతిగారి ఇల్లు |

## "అచలమైన దైవం - నడిచే దైవమై - నడచి వచ్చిన రోజు"

అరుణాచలేశ్వరుడే, తిరుచ్చుళిలో రమణుడుగా జన్మించి అరుణాచలక్షేత్రానికి వచ్చారు. వారు అనుకోని రాలేదు. అంతర్యామి ఐన అరుణాచల శివుని ప్రేరణతో వచ్చారు. మదురలో స్వస్వరూప ఆనందములో మునిగియున్న ఆ ఉపాధిని గుర్తించలేక, చదువుపై శ్రద్ధలేదనే నెపంతో "అరణ్యాలకుపోరాదా!" అన్న సోదరుని హేళన, దెప్పి పొడుపులతో సరిపెట్టక, తండ్రి దగ్గరకు వెళ్లటానికి ధనాన్ని సమకూర్చి, తప్పదారిని వెడుతున్న బిడ్డకు మార్గదర్శిగా ఒక మౌల్వీ వేషధారణలో సూచనలు ఇచ్చి అచలమైన అరుణాచలానికి చేర్చాడు అరుణాచలశివుడు. ఆ రోజు ది. 1-9-1896 సంవత్సరం. నాటి వైభవాన్ని గుర్తుగాను, మరియు రమణమహర్షి 125 జయంతి మహోత్సవాలను పురస్కరించుకొని, తమిళనాడు, ఆంధ్రా పట్టణాల మీదుగా సాగే రథయాత్ర ది. 1-9-2004 తేదీకి అరుణాచలం చేరే సందర్భంగా శ్రీరమణ వైభవాన్ని తిలకిద్దాము. భగవంతుడు మానవజాతికి బహుమతిగా భగవాన్ రమణుణ్ణి ప్రసాదించాడు. రమణా అంటే ఆత్మమాత్రమే. భగవాన్ శరీరాన్ని పొందక మునుపు పండితులు అంతా శాస్త్రాలలో మునిగిపోయారు. భగవాన్ విషయాన్ని అనుభవంతో చెప్పి శాస్త్రాలనుంచి ప్రజలను మళ్లించిన మహానుబావుడు. గణపతి మునికి సత్యాన్ని సూటిగా తెల్పినారు. సమత్వ అనే మాట గుర్తుకు వస్తే ఆయన గుర్తుకు వస్తారు. మానవులనేకాదు. పశుపక్షాదులను, చెట్లను సమానంగా చూచేవారు. గాంధీజీ అనుయాయులు ఎవరైనా అశాంతిలో ఉంటే, రమణాశ్రమానికి వెళ్లమనేవారు. రమణకు "భూమా (ఆత్మ) విద్యావిశారదుడు" అనే పేరు ఉంది "నేను ఎవడను?" "అని ప్రశ్నించుకోవటం వల్ల నీకు నీవే మహోపకారం చేసుకొన్నట్లే" అనేవారు అత్మ ఒక్కటే సత్యం. మిగిలినవి అన్ని నీ మనోకల్పితాలే "ఊరక ఉండు" అన్నారు. విచారణా మార్గం సాధ్యంకాకపోతే, భక్తిమార్గంలో ప్రయాణం చెయ్యటానికి "అక్షరమణమాల" ను ప్రసాదించారు. శ్రీనాన్నగారు అంటారు "అరుణాచలరమణుడు అనటం కంటే ఆనందరమణుడు అంటే బాగుంటుంది. బుద్ధునికాలం - రమణునికాలం స్వర్ణకాలం. మధ్యవర్తులతో సంబంధంలేకుండా శాంతి, సుఖాలను లోకానికి అందించటానికి కృషి చేసి మహాత్ములైనారు" అన్నారు.

**సాగిరాజు రామకృష్ణంరాజు**

అర్ధవరం





పాలకొల్లు వాస్తవ్యులు కేంద్ర బొగ్గుగనులశాఖ సహాయమంత్రి
**శ్రీ దాసరి నారాయణరావు గారిని**
ది. 13-8-04వ తేదీన పాలకొల్లులో సన్మానిస్తున్న **సద్గురు శ్రీనాన్నగారు**

### రమణ భాస్కర సంవత్సర చందా రు. 150/-

**ఎడిటర్ పెన్మెత్స శ్రీరామరాజు గారికి**
**శ్రీరమణ క్షేత్రం, జిన్నూరు - 534 265, ప॥గో॥జిల్లా, ఆంధ్రప్రదేశ్**

రమణ భాస్కర సంవత్సర చందా (ది. 20-9-2004 నుండి ది. 5-9-2005 వరకు) నిమిత్తం రూ. 150/-లు పంపుచున్నాను. (ఈ కూపను పూర్తి చేసి పంపించండి)

పేరు ..................................................

తండ్రి / C/o..................................................

డోర్ నెం.........................వీధి / రోడ్ నెం..................................................

గ్రామం ........................................ పిన్ కోడ్ ........................................

మండలం ........................................ జిల్లా ........................................

డి.డి./ఇండియన్ బ్యాంక్, జిన్నూరు/ యమ్.ఓ./నగదు ..................................................

ఫోన్ (STD కోడ్‌తో సహా).................. ..................................................

గమనిక : అన్ని కాలమ్స్ పూర్తిచేసి పంపితేనే ప్రవచనాలు మీకు అందజేయుట మా బాధ్యత.

– ఎడిటర్